ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- పెండింగ్ స్కాలర్‌షిప్స్ ఇవ్వాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, వేదికపై మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

కరీంనగర్ రూరల్, జూన్ 25 : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ రూ.7 వేల కోట్ల బకాయిలు తక్షణమే విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అధ్యక్షతన నగర శివారులోని ట్రినిటి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభమైన తెలంగాణ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక, సైద్ధాంతిక రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ విద్యను కార్పొరేటీకరణ చేసిందని, కాషాయీకరణ చేయడానికి జాతీయ విద్యావిధానం తీసుకొచ్చి విద్యార్థుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నదని మండిపడ్డారు. నీట్ పరీక్ష లీక్ అవకతవకలు జరిగాయని దేశమంతా ఆందోళనలు జరుగుతున్న నేపథ్యాన్ని మరువకముందే, యూజీసీ నెట్ పరీక్షను రద్దు చేస్తున్నట్టు ప్రకటించడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడడమేనని అందోళన వ్యక్తం చేశారు. అవకతవకలపై సుప్రీం కోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, బాధ్యులుగా ఉన్న కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ట్రినిటీ విద్యా సంస్థల చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, గత 50 ఏండ్ల అనుభవంలో విద్య కాషాయీకరణ, శాస్త్రీయ విద్యా విధానాం అమలు జరగడం లేదని వాపోయారు. విద్యనందించే ఉపాధ్యాయులకు ఉత్తమ శిక్షణ ద్వారానే మార్పు సాధ్యమవుతుందన్నారు. జ్ఞానం కోసం చదివి నైపుణ్యం సంపాదించుకుంటే జీవితంలో ముందుకు పోతామన్నారు. విద్యార్థి సంఘాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థలో విధానాలపై ప్రశ్నించాలన్నారు. పోరాటంలో అన్యాయాన్ని ప్రశ్నిస్తూనే బాధ్యత గురైరగాలన్నారు. సమావేశంలో జిల్లా సీపీఐ కార్యదర్శి మర్రి వెంకటస్వామి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొయ్యడ సృజన్‌కుమార్, రాష్ట్ర మాజీ నాయకులు మంద పవన్, మహేందర్, రఘురాం, సోతుకు ప్రవీణ్, రాజు, మచ్చ రమేశ్, జనార్దన్, అంజి, సంతోష్, వెంకటేశ్, శరత్ పాల్గొన్నారు.

రెండు నెలలు దాటినా వేతనాలు ఇవ్వరా?

- ఇంకో ఐదు రోజులైతే మూడు నెలలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం
- ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న కార్మికుల ఆవేదన • కరీంనగర్ ప్రభుత్వ దవాఖాన ఎదుట ధర్నా

కరీంనగర్ విద్యానగర్, జూన్ 25 : ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డు కార్మికులు ధర్నా చేశారు. ఇప్పటికే రెండు నెలలు దాటిందని.. మరో ఐదు రోజులైతే మూడు నెలలు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు వెంటనే చెల్లించాలని, లేకుంటే కలెక్టరెట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం కరీంనగర్ దవాఖాన ఎదుట ధర్నా చేశారు. గౌరవ అధ్యక్షుడు బండారి శేఖర్ పాల్గొని, మాట్లాడారు. రెండు నెలలుగా వేతనాలు రావడం లేదని, పిల్లల స్కూల్ ఫీజులు, బుక్స్, యూనిఫామ్‌ల కోసం ఇబ్బందులు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి అద్దె చెల్లించలేకపోతే యజమానులు ఖాళీ చేయాలని అంటున్నారని వాపోయారు. ఇతర కిరాణా సరకులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే కార్మికుల వేతనాల బడ్జెట్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ధర్నాలో ప్రభుత్వ దవాఖాన వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు పీ అరుణ్, ఉపాధ్యక్షురాలు కళావతి, యూత్ లీగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రినేత, శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్, 100 మంది కార్మికులు పాల్గొన్నారు.

అవినీతి జరగలేదని నిరూపించుకో..

- నేను ఎలాంటి అవినీతికి పాల్పడ లేదని తడి బట్టలతో ప్రమాణం చేశా • నేడు హైదరాబాద్ అపోలో వేంకటేశ్వరస్వామి సాక్షిగా ప్రమాణం చేద్దాం • నిరూపించుకుంటే బహింగ క్షమాపణ చెప్తా
- మంత్రి పొన్నంకు మరోసారి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సవాల్ • చెల్పూర్ ఆలయానికి వెళ్తుండగా వీణవంకలో హౌస్ అరెస్ట్ • ఇంటి ఆవరణలోనే స్నానం.. తడిబట్టలతో ఆంజనేయస్వామిపై ప్రమాణం

వీణవంకలోని తన నివాసం ఆవరణలో స్నానం చేసి, తడిబట్టలతో ప్రమాణం చేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, జూన్ 25 : తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, తడి బట్టలతో దైవ ప్రమాణంగా చెబుతున్నానని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి స్పష్టం చేశారు. తాను ఎలాగైతే ప్రమాణం చేసి నిజాయితీని నిరూపించుకున్నానో పొన్నం ప్రభాకర్ కూడా నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. ప్రభుత్వం మీదేనని, తనను అరెస్ట్ చేయద్దని, మీరు అరెస్ట్ కావొద్దని, ఇద్దరమే గుడిలోకి వెళ్లి స్నానం చేసి, తడి బట్టలతో ప్రమాణం చేద్దామని అని చెప్పారు. ఫ్లైయాష్ రవాణాలో అవినీతి చేయలేదని నిరూపణ చేస్తే బహిరంగ క్షమాపణ చెప్తానని తేల్చి చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఫ్లైయాష్ రవాణాలో ₹వంద కోట్ల అవినీతికి పాల్పడ్డారని పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించగా, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు సోమవారం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అవినీతికి పాల్పడ్డారని, లేకుంటే చెల్పూర్ ఆంజనేయస్వామి గుడికి వచ్చి ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను స్వీకరించిన ఎమ్మెల్యే మంగళవారం వీణవంకలోని తన నివాసం నుంచి చెల్పూర్‌కు బయలు దేరేందుకు సిద్ధం కాగా, సుమారు 200 మంది పోలీసులు ఇంటిని చుట్టు ముట్టి గృహ నిర్బంధం చేశారు. స్థానిక బస్టాండ్ నుంచి ఆయన నివాసం వరకు భారీ సంఖ్యలో పోలీసులు మోహరించి, ఎవరినీ ఇంట్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. సుమారు గంట తర్వాత నాయకులను ఒక్కొక్కరిగా అనుమతించారు. పోలీసులు అడ్డుకోవడంతో ఎమ్మెల్యే తన ఇంటి ఆవరణలోనే నాయకులు, మీడియా, పోలీసుల సమక్షంలో స్నానం చేసి, ఆంజనేయస్వామి చిత్రపటంపై చేయి వేసి 'కాంగ్రెస్ నాయకులు ఆరోపించినట్టు నేను ఎలాంటి అవినీతికి పాల్పడలేదు. వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి సాక్షిగా ప్రమాణం చేస్తున్నా' అంటూ చెప్పారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. యావత్తు తెలంగాణ ప్రజలకు తెలియాలని, బాధ్యతైన శాసనసభ్యుడిగా చట్టాన్ని గౌరవించి ఇంట్లోనే తిరుపతి వేంకటేశ్వర స్వామి కండువా కప్పుకొని, ఆంజనేయ స్వామి చిత్రపటం పట్టుకొని ప్రమాణం చేసినట్టు తెలిపారు. తాను నమ్మినట్టు నియోజకవర్గంలోనే దేవుడిని ఎవరూ నమ్మరని అనుకుంటున్నానని, అంత భక్తి దేవుడిపై తనకు ఉంటుందన్నారు. తనను నమ్మి ఓటు వేసిన ప్రజల కోసం తన నిజాయితీని నిరూపించుకోవడానికి ప్రమాణం చేశానని చెప్పారు. ఫ్లైయాష్‌లో ₹వంద కోట్ల అవినీతి చేశారని బహిరంగంగా చెప్పానని, దీనిపై ఎందుకు ఇప్పటి వరకు స్పందించడం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ప్రశ్నించారు. 'నేను మరో అవకాశం ఇస్తున్నా. మీరు, నేను ఇద్దరమే కలిసి బుధవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ అపోలో టీటీడీ వేంకటేశ్వరస్వామి గుడికి పోదాం. ₹వంద కోట్ల అవినీతి చేయలేదని నిరూపణ చెయ్యి. బహిరంగ క్షమాపణ చెప్త' అని స్పష్టం చేశారు. ఫ్లైయాష్‌తో పాటు ఓవర్‌లోడ్ లారీలు ఎందుకు ఆపడం లేదో రవాణాశాఖ మంత్రిగా ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. ఓవర్ లోడ్ లారీలు వెళ్లడం లేదని చెప్పే దమ్ము, ధైర్యం మంత్రికి ఉందా అని ప్రశ్నించారు. తన దగ్గర ఆధారాలున్నాయని, తాను చూపిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వీణవంక, ఇల్లందకుంట, హుజూరాబాద్ ఎంపీపీలు ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, పావని-వెంకటేశ్, రాణి-సురేందర్‌రెడ్డి, జడ్పీటీసీ మాడవనమాల-సాదవరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోల్నేని సత్యనారాయణ రావు, వీణవంక వైస్‌ఎంపీపీ లత-శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు నీల కుమార్, కోమాల్‌రెడ్డి, కాంతారెడ్డి, ఎంపీటీసీలు సంజీవరెడ్డి, మూల రజిత-పుల్లారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూండాలపై చర్యలు తీసుకోవాలి

చెల్పూర్ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద పోలీసులు విధులు నిర్వహిస్తుంటే ఎస్ఐ మీదికి కాంగ్రెస్ నాయకులు గూండాల్లాగా వెళ్లినట్టు తాను సోషల్ మీడియాలో చూశానని పాడి కౌశిక్‌రెడ్డి చెప్పారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన కాంగ్రెస్ గూండాలపై చర్యలు తీసుకోవాలని కరీంనగర్ సీపీని కోరారు.

కవ్వంపల్లికి గుండెపోటని వైరల్

- కొట్టి పారేసిన ఎమ్మెల్యే

తిమ్మాపూర్, జూన్ 25 : మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు గుండెపోటు వచ్చి దవాఖానలో చికిత్స పొందుతున్నట్టు ఓ వార్త నియోజకవర్గ వ్యాప్తంగా సోషల్ మీడియాలో మంగళవారం మధ్యాహ్నం వైరల్ అయింది. రెండు రోజుల క్రితం ఆయన గుండె సంబంధిత ఇబ్బందులతో ద వాఖానలో పరీక్షలు చేయించుకోగా కొద్ది రోజులు రెస్ట్ తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు సమాచారం. అయితే, ఆ వార్త అబద్ధం అంటూ క్యాంప్ ఆఫీస్ నుంచి నోట్ విడుదల చేశారు. సాయంత్రం స్వయంగా ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ ఓ వీడియో విడుదల చేశారు. తన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎవరూ ఆందోళన చెందవద్దని, గుండెపోటు వచ్చిందన్న వదంతులను కొట్టి పడేశారు. బుధవారం క్యాంప్ ఆఫీస్‌లో అందుబాటులో ఉంటానని చెప్పారు. కాగా, తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గస్థాయి జాబ్ మేళా మంగళవారం జరగగా ముఖ్యఅతిథిగా హాజరు కావాల్సిన ఆయన రాకపోవడంతో ఈ వార్తకు బలం చేకూరినట్లయింది.

మహిళా హోంగార్డులపై దౌర్జన్యం

- కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల అత్యుత్సాహం
- చెల్పూర్‌లో టెన్షన్.. టెన్షన్ • మూడు గంటల పాటు ఉద్రిక్తత

చెల్పూర్‌లో గుడి వద్ద పోలీసులు, కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం

హుజూరాబాద్ రూరల్, జూన్ 25 : కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. విధుల్లో మహిళా హోంగార్డులపై దౌర్జన్యానికి దిగారు. దీంతో చెల్పూర్‌లో దాదాపు మూడు గంటల పాటు ఉద్రిక్తత నెలకొన్నది. అసలేం జరిగిందంటే.. ఫ్లైయాష్ ఉదంతంలో హుజూరాబాద్ మండలం చెల్పూర్‌లోని హనుమాన్ దేవాలయంలో ప్రమాణం చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి సోమవారం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు సవాల్ విసిరిన విషయం తెలిసిందే. ఈ సవాల్‌ను స్వీకరించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మంగళవారం చెల్పూర్‌కు వచ్చి తన నిజాయితీని చాటుకుంటానని బదులిచ్చాడు. అయితే, ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా ఉండేందుకు సింగాపూర్‌లో ప్రణవ్‌బాబును, వీణవంకలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని ముందస్తుగా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అదేవిధంగా ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చెల్పూర్‌లోనూ పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. కాగా, కాంగ్రెస్ మహిళా నాయకులు ముందు వరుసలో, వారి వెనకాల ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేసుకుంటూ శాంతి భద్రతలకు భంగం కలిగించేలా గుడి ఆవరణలోకి ర్యాలీగా వచ్చారు. దీంతో అక్కడే ఉన్న ముగ్గురు మహిళా హోంగార్డులు గుడి ఆవరణలో నినాదాలు చేయవద్దని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఏసీపీ శ్రీనివాస్ జీ సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా వాళ్లు వినలేదు. ఆగ్రహంతో ఊగిపోతూ విధుల్లో ఉన్న మహిళా హోంగార్డులను దుర్భాషలాడుతూ నెట్టివేశారు. దీంతో ఏసీపీ, పోలీసులు బెదిరించడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పరుగులు పెట్టారు. ఈ ఘటనతో చెల్పూర్‌లో మూడు గంటల పాటు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.

అయ్యో కొడుకా..

- ఆడుకోవాల్సిన చేతులతో తండ్రి చితికి నిప్పు
- తల్లిచంకలో దీనంగా ఉన్న బాలుడిని చూసిన చూసి చలించిన గ్రామస్తులు

అంత్యక్రియల్లో భార్య, కూతురు, కొడుకు

మానకొండూర్ రూరల్, జూన్ 25 : బుడి బుడి అడుగులు వేస్తూ నాన్న చేతిని పట్టుకొని నడవాల్సిన ఆ చిన్నోడు.. ఏడుస్తూ తండ్రి అంతిమ యాత్రలో కుండ పట్టడం చూసి ప్రతి ఒక్కరి గుండె తరుక్కుపోయింది. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం జగ్గయ్యపల్లికి చెందిన చెంచు కుమార్ (36) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయన తండ్రి గతంలోనే మరణించగా భార్య హారిక, కూతురు మహా (11), కొడుకు శివ మితున్ (2), తల్లి ఓదవ్వ ఉన్నారు. అయితే, కుమార్ అంత్యక్రియల్లో ఆయన భార్య చంకలో రెండేళ్ల శివ మితున్ దీనంగా కుండ పట్టుకొని కనిపించిన దృశ్యాలను ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించాయి. చిన్న వయసులోనే బాలుడిని చూసి ప్రతి ఒక్కరి హృదయాలను కదిలించింది. వారి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వాణిజ్య

తొలిరోజు 11 వేల కోట్ల స్పెక్ట్రం వేలం

న్యూఢిల్లీ, జూన్ 25: స్పెక్ట్రం వేలానికి టెలికం సంస్థల నుంచి అనూహ్య స్పందన లభించింది. తొలిరోజు నిర్వహించిన ఐదు రౌండ్లలో రూ.11 వేల కోట్ల విలువైన వాయుతరంగాలకు బిడ్లు దాఖలయ్యాయని తెలుస్తున్నది. ఈసారి నిర్వహిస్తున్న 10,500 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రం వేలం ద్వారా రూ.96,238 కోట్ల నిధులు సమకూరవచ్చునని కేంద్రం అంచనావేసింది. ఈ వేలం రెండోరోజు బుధవారం కూడా కొనసాగనున్నది. తొలి రోజు నిర్వహించిన 900, 1800 మెగాహెర్ట్జ్ బాండ్స్ వేలంలో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు పాల్గొన్నాయి.

ఐపీవోకి మారుతి ఇస్పాత్

హైదరాబాద్, జూన్ 25: దక్షిణాదిలో రెండో అతిపెద్ద స్టీల్ తయారీ సంస్థ మారుతి ఇస్పాత్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఎంఐపీపీఎల్)...నూతన బ్రాండ్ 'ఎంఎస్ వాయు'ను మార్కెట్‌కు పరిచయం చేసింది. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో అభిశేక్ అగర్వాల్ మాట్లాడుతూ..వ్యాపారాన్ని దేశవ్యాప్తంగా విస్తరించడానికి వచ్చే ఐదేండ్లలో రూ.2 వేల కోట్ల స్థాయిలో పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతానికి దక్షిణాదితోపాటు పడమర భారతంలో తన ఉత్పత్తులను విక్రయిస్తున్న సంస్థ..వచ్చే ఐదేండ్లలో ఉత్తర, తూర్పు భారతానికి విస్తరించనున్నట్లు, ఇందు కోసం కొత్తగా స్టీల్ తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం వచ్చే రెండేండ్లలో ఐపీవోకి రాబోతున్నట్టు చెప్పారు.

సిడ్స్ ఫార్మ్ 83 కోట్ల సేకరణ

హైదరాబాద్, జూన్ 25: డెయిరీ స్టార్టప్ సిడ్స్ ఫార్మ్..వ్యాపార విస్తరణ కోసం అవసరమయ్యే నిధులో 10 మిలియన్ డాలర్ల(రూ.83 కోట్లు)ను పెట్టుబడిదారుల నుంచి సేకరించింది. ఈ నిధులతో హైదరాబాద్‌తోపాటు బెంగళూరులో ఉన్న పాల ఉత్పత్తుల కేంద్రాల సామర్థ్యాన్ని పెంచడానికి వినియోగించనున్నట్లు కంపెనీ ఫౌండర్ కిశోర్ ఇందుకూరి తెలిపారు. అధిక నాణ్యత పాల ఉత్పత్తులకు పెరగనున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. 2016లో హైదరాబాద్ కేంద్రంగా పాల ఉత్పత్తుల సేవలను ఆరంభించిన సంస్థకు ప్రస్తుతం ఈ రెండు నగరాల్లో 25 వేల మంది కస్టమర్లు ఉన్నారు.

జోష్‌పెత్తిన మార్కెట్లు

ఆల్‌టైమ్ హైల్లో సూచీలు

- క్యూ4లో కలిసొచ్చిన కరెంట్ ఖాతా మిగులు
- 712 పాయింట్లు ఎగిసి తొలిసారి 78వేలపైకి సెన్సెక్స్
- 183 పాయింట్లు పెరిగి 23,721 స్థాయికి నిఫ్టీ
- మదుపరులను ఆకట్టుకున్న బ్యాంకింగ్, ఐటీ షేర్లు

ముంబై, జూన్ 25: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ లాభాలను అందుకున్నాయి. ఈ క్రమంలోనే ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడ్డాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ తొలిసారి 78వేల మార్కును దాటింది. 712.44 పాయింట్లు లేదా 0.92 శాతం ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా 78,053.52 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 823.63 పాయింట్లు అందిపుచ్చుకొని 78,164.71 స్థాయిని తాకింది. తద్వారా ఇంట్రా-డే హై రికార్డును నెలకొల్పింది. ఈ నెల 10న సెన్సెక్స్ మొదటిసారి 77వేల మార్కును అందుకున్న విషయం తెలిసిందే. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 183.45 పాయింట్లు లేదా 0.78 శాతం ఎగిసి గతంలో ఎన్నడూ లేనివిధంగా 23,721.30 వద్ద ముగిసింది. ఇంట్రా-డేలోనూ సరికొత్త స్థాయిని చేరింది. 216.3 పాయింట్లు పెరిగి 23,754.15 వద్దకు వెళ్లింది.

బ్లూచిప్ ఉత్సాహం

ఇతర ఆసియా దేశాల మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాల నడుమ మొదలైన దేశీయ స్టాక్ మార్కెట్లకు బ్లూచిప్ కంపెనీలు దన్నుగా నిలిచాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, ఎస్బీఐ, ఎల్‌అండ్‌టీ, బజాజ్ ఫిన్‌సర్వ్ తదితర బడా సంస్థల షేర్ల కొనుగోళ్లకు మదుపరులు పోటీపడ్డారు. దీంతో సెన్సెక్స్ పరుగులు పెట్టింది. ఈ క్రమంలోనే ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ 100 బిలియన్ డాలర్ల మార్కును తాకింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్‌ల తర్వాత ఈ ఘనత సాధించిన ఆరో సంస్థగా నిలిచింది. బీఎస్ఈలో 2.48 శాతం పెరిగి రూ.1,199.05 వద్ద ఐసీఐసీఐ బ్యాంక్ షేర్ విలువ ఉన్నది. ఎన్ఎస్ఈలో 2.90 శాతం వృద్ధితో రూ.1,204గా ఉన్నది. ఇక బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలూ 0.26 శాతం, 0.03 శాతం చొప్పున పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్ల విషయానికొస్తే.. ఆసియా దేశాల్లో దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ సూచీలు లాభాల్లో ఉన్నాయి. చైనా నష్టపోయింది. ఐరోపా మార్కెట్లలో ప్రధాన సూచీలు నష్టాల్లోనే కదలాడుతున్నాయి.

రంగాలవారీగా..

బ్యాంకింగ్ రంగ షేర్లు గరిష్ఠంగా 1.87 శాతం మేర పెరిగాయి. అలాగే ఆర్థిక సేవలు 1.45 శాతం, ఐటీ 0.53 శాతం, క్యాపిటల్ గూడ్స్ 0.28 శాతం, టెక్నాలజీ 0.43 శాతం చొప్పున బలపడ్డాయి. కానీ రియల్టీ, పవర్, యుటిలిటీస్, మెటల్, టెలికం షేర్లు 1.82 శాతం నుంచి 0.28 శాతం వరకు నష్టపోయాయి. కాగా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వివరాల ప్రకారం ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో కరెంట్ ఖాతా మిగులు 5.7 బిలియన్ డాలర్లుగా నమోదైంది. దేశ జీడీపీలో ఇది 0.6 శాతానికి సమానం. ఇది సహజంగానే స్టాక్ మార్కెట్లకు ఉత్సాహాన్నిచ్చిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. రూపాయిపై ఒత్తిళ్లను తగ్గించిందని, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులకూ మార్గాన్ని సుగమం చేసిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రధాన పెట్టుబడుల వ్యూహకర్త వీకే విజయకుమార్ అన్నారు. వడ్డీరేట్ల కోతలపై అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ నుంచి స్పష్టత రాబోతున్నదన్న సంకేతాలూ కలిసొచ్చాయని ఆయన తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు.



అమర రాజా దూకుడు

తెలుగు రాష్ట్రాలకు చెందిన అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ కంపెనీ షేర్ల విలువ ఈ ఒక్కరోజే 19 శాతానికిపైగా పెరిగింది. సంస్థకు అనుబంధంగా ఉన్న అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్.. లిథియం-ఐయాన్ సెల్స్ టెక్నాలజీ కోసం జీఐబీ ఎనర్జీఎక్స్‌తో చేసుకున్న లైసెన్సింగ్ ఒప్పందం.. మదుపరుల్లో జోష్‌ను పెంచింది. షేర్ల కొనుగోళ్లకు పోటెత్తారు. దీంతో బీఎస్ఈలో 19.40 శాతం వృద్ధితో రూ.1,647 వద్ద షేర్ విలువ ముగిసింది. ఒకానొక దశలో 52 వారాల గరిష్ఠాన్ని తాకుతూ 19.99 శాతం ఎగిసి 1,655.20కు చేరింది. ఎన్ఎస్ఈలోనూ 19.56 శాతం లాభపడి రూ.1,650 వద్ద నిలిచింది. ఇంట్రా-డేలో 19.99 శాతం ఎగబాకి 52 వారాల గరిష్ఠాన్ని చేరుతూ 1,656.05 వద్దకు వెళ్లింది.

బ్యాంకింగ్ సేవలకు స్మార్ట్ లాక్

వినూత్న సేవలకు ఐసీఐసీఐ బ్యాంక్ శ్రీకారం

న్యూఢిల్లీ, జూన్ 25: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన ఐసీఐసీఐ బ్యాంక్..మరో వినూత్న సేవలకు శ్రీకారం చుట్టింది. బ్యాంకింగ్ సేవలను లాక్ చేసుకోవడంతో పాటు అన్‌లాక్ చేసుకునే సేవలను ప్రారంభించింది. ఇందుకోసం స్మార్ట్‌లాక్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేవలతో బ్యాంక్ ఖాతాకు లాక్ లేదా అన్‌లాక్ చేసుకోవచ్చును. అలాగే యూపీఐ, క్రెడిట్, డెబిట్ కార్డులకు సంబంధించి లావాదేవీలను కూడా నిలిపివేసుకోవచ్చును. ఫోన్ లేదా ఈ-మెయిల్ అవసరం లేకుండానే తమ ఖాతాకు సంబంధించిన అన్ని రకాల సేవలను నిలిపివేసుకోవచ్చును. దేశీయ బ్యాంకింగ్ రంగంలో ఇలాంటి నూతన సేవలు అందుబాటులోకి రావడం ఇదే తొలిసారి. ఈ స్మార్ట్‌లాక్ ద్వారా ఖాతాదారుడు ఐమొబిలీ పే సేవలను నిలిపివేసుకోవచ్చునని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి.

స్మార్ట్‌లాక్ ఫీచర్స్ ఇవే..

- ఐమొబిలియో పేలో లాగిన్ కావాలి
- హోమ్ స్క్రీన్ కుడి దిగువ మూలలో స్మార్ట్‌లాక్ ఫీచర్ బటన్‌ను నొక్కాలి.
- దీంతో కీలక బ్యాంకింగ్ సేవలను లాక్/అన్‌లాక్ చేసుకునే వీలుంటుంది.

తగ్గిన జావా 350 బైకు ధర

న్యూఢిల్లీ, జూన్ 25: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన మహీంద్రా అండ్ మహీంద్రా కీలక నిర్ణయం తీసుకున్నది. తన ప్రీమియం బైకులు జావా మాడళ్ల ధరలను రూ.15 వేల వరకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. ఈ ఏడాది తొలినాళ్లలో దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన క్లాసిక్ 350, జావా 350 మాడళ్లు రూ.2.14 లక్షల ప్రారంభ ధరతో లభించనున్నాయి. దీంతో జావా 350 బైకు ధర రూ.2,14,950 నుంచి రూ.1,98,950కి దిగొచ్చింది. ఈ బైకు 334 సీసీ సామర్థ్యంతో రూపొందించింది.

ఎఫ్ఎంసీజీలో 9% వృద్ధి

న్యూఢిల్లీ, జూన్ 25: ఈ ఏడాదిలో ఎఫ్ఎంసీజీ రంగం 7-9 శాతం వృద్ధిని నమోదు చేసుకోనున్నదని ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్